RNI NO: APTEL/1999/00528

PRITHIVI
CARBON SOLUTIONS PVT LTD
पृथ्वी कार्बन
Nature • Carbon • Communities

# వేద భేరి

తెలుగు దినపత్రిక
వ్యవస్థాపకులు కీ శే. మునునూరి వెంకట మోహన రావు




విశాఖపట్నం బుధవారం 15 జూలై 2026 ఎడిటర్ : మునునూరి సూర్యనారాయణమూర్తి సంపుటి - 10 సంచిక -76 పేజీలు -04 వెల : రూ.1/-

## యూపీలోని భారత్-నేపాల్ సరిహద్దులో అమెరికా పౌరుడు అరెస్ట్



సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా భారత్‌కు చేరుకుని, ఇక్కడి నుంచి నేపాల్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఓ అమెరికా పౌరుడిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లా సోనౌలీ సరిహద్దు వద్ద జులై 11న ఈ ఘటన చోటుచేసుకుంది. కాలిఫోర్నియాకు చెందిన జోర్డాన్ బ్రౌన్ (36) అనే వ్యక్తిని సశస్త్ర సీమా బల్ (SSB) సిబ్బంది అరెస్ట్ చేశారు.

సోనౌలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మైనీహ్వా ప్రాంతంలో, సరిహద్దు పిల్లర్ 516 వద్ద ఎస్ఎస్‌బీ సిబ్బంది గస్తీ నిర్వహిస్తుండగా, జోర్డాన్ బ్రౌన్ అక్రమ మార్గంలో నేపాల్ వైపు వెళుతూ పట్టుబడ్డాడు. అతడిని విచారించగా, అతని వద్ద పాస్‌పోర్ట్, వీసా వంటి ఎటువంటి గుర్తింపు పత్రాలు లేవని తేలింది. విచారణలో భాగంగా, తన పాస్‌పోర్ట్‌ను థాయ్‌లాండ్‌లో పోగొట్టుకున్నానని, 2025 నవంబర్‌లో శ్రీలంక నుంచి సముద్ర మార్గం ద్వారా భారత్‌లోకి ప్రవేశించి, అప్పటి నుంచి గోవాలో నివసిస్తున్నట్లు అతను వెల్లడించాడు.

నిందితుడి వద్ద నుంచి రూ. 31,460 నగదు, మొబైల్ ఫోన్లు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు మహారాజ్‌గంజ్ అదనపు ఎస్పీ సిద్ధార్థ్ వెల్లడించారు. ఇమ్మిగ్రేషన్, ఫారినర్స్ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. తాను గతంలో యూఎస్ నేవీ, స్పెషల్ ఫోర్సెస్‌లో పనిచేశానని అతను చెప్పిన (మిగతా 2వ పేజీలో)

# డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ రిజల్ట్స్





**నెలవారీ ఆర్థిక నివేదికలతో ఆశించిన పురోగతి**
**అర్జీల పరిష్కారం, క్షేత్ర స్థాయి పర్యటనలు తప్పనిసరి**
**ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలి**
**మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

అమరావతి, జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ రిజల్ట్స్ సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించారు. డేటా డ్రివెన్ గవర్నెన్సు ఆధారంగా పాలనను మరింత సులభతరం చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం అన్నారు. దీని కోసం దేశంలోనే మొదటిసారిగా మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా వృద్ధిని సమీక్షించుకుంటున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతీ నెలా... నెలవారీ ఆర్థిక నివేదికలను విడుదల చేస్తామని దానికి అనుగుణంగా రాష్ట్ర పురోగతి కోసం ప్రభుత్వ శాఖలు పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో మంగళవారం మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో ఎంఈఆర్‌పై నిర్వహించిన సమావేశంలో సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నెలవారీ ఆర్థిక నివేదికల ద్వారా ఎప్పటికప్పుడు రెవెన్యూ రాబడులను అంచనా వేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అధికారులు, ఉద్యోగుల నెలవారీ పనితీరును, నైపుణ్యాలను కూడా ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని ముందుకు వెళ్తామన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."2019-2024 మధ్య అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం రెండేళ్లుగా సమిష్టిగా పనిచేసాం. ప్రభుత్వ ఆలోచనల్ని అధికార యంత్రాంగం సమర్ధంగా అమలు చేసింది. క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పుల్ని కొంతవరకు సాధించగలిగాం. మరిన్ని రంగాల్లో మరింతగా మెరుగుపడాలి. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పన చేశాం. తలసరి ఆదాయం, జీఎస్డీపీ లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. సుపరిపాలన అందించేలా ప్రతీ సోమవారం ఆర్టీజీఎస్ నుంచి సమీక్షలతో పాటు 4 సార్లు మంత్రులు, కార్యదర్శుల సమావేశాలు, 7 సార్లు కలెక్టర్ల సదస్సులు నిర్వహించాం. (మిగతా 2వ పేజీలో)

## మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కన్నుమూత

జర్నలిస్ట్ పవర్ - కాకినాడ: ప్రముఖ కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం (73) కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇవాళ (జులై 14) హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ముద్రగడ మరణవార్తతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర విషాదం అలుముకుంది.

ముద్రగడ పద్మనాభం 1953 జనవరి 22న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో జన్మించారు. ఆయన ప్రాథమిక పాఠశాల విద్య స్వగ్రామంలోనే సాగింది. ముద్రగడది మొదటి నుంచి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. ఆయన తాతయ్య పద్మనాభం గ్రామానికి మున్సబ్‌గా పని చేయగా, తండ్రి ముద్రగడ వీర రాఘవరావు రాజకీయాల్లో అత్యంత క్రియాశీలంగా ఉండేవారు. వీర రాఘవరావు 1962, 1967 ఎన్నికలలో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నియోజకవర్గంలోని నిరుపేదలు, దళితులకు ఆయన అత్యంత అభిమాన నాయకుడిగా నిలిచారు.

మాజీ భారత రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డికి ముద్రగడ వీర రాఘవరావు అత్యంత ఆప్తుడు. 1977లో వీర రాఘవరావు మరణించిన తర్వాత, నీలం సంజీవరెడ్డి సూచన మేరకు ముద్రగడ పద్మనాభం రాజకీయాల్లోకి అడుగుపెట్టారు.

1978లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నిరుపేదలు, గిరిజనులు, బీసీలు పద్మనాభంలో ఆయన తండ్రి రూపాన్ని చూసుకుని భారీ మెజారిటీతో గెలిపించారు. ఆ తర్వాత ఆయన వెనుదిరిగి చూసుకోలేదు. 1978, 1983, 1985, 1989



శాసనసభ ఎన్నికలలో వరుసగా నాలుగు సార్లు ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో రెండు సార్లు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించడమే కాకుండా, కాకినాడ నియోజకవర్గం నుంచి లోక్‌సభ సభ్యుడిగా కూడా దేశ రాజధానిలో అడుగుపెట్టారు.

రాజకీయ పదవుల కంటే కూడా కాపు సామాజిక వర్గాన్ని వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చాలంటూ ముద్రగడ పద్మనాభం చేసిన పోరాటాలు ఆయనకు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయి.కాపు రిజర్వేషన్ల సాధన కోసం ఆయన తన జీవిత కాలంలో ఏకంగా ఏడుసార్లు ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టారు. 2016లో తుని వేదికగా ఆయన నేతృత్వంలో నిర్వహించిన 'కాపు ఐక్య గర్జన' సభ అక్కడ జరిగిన రైల్వే ఘటన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ఊపేసింది. ఈ ఘటనతో కాపు రిజర్వేషన్ల అంశాన్ని ఆయన జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. తద్వారా కాపు సామాజిక వర్గానికి తిరుగులేని ఉద్యమ నేతగా ముద్రగడ చరిత్రలో నిలిచిపోయారు.

## మత్స్యకారుల కన్నీళ్లతో రాజకీయాలు మానాలి : జగన్‌రెడ్డి

**మత్స్యకారులను మోసం చేసింది గొడ్డలి పార్టీ**
**టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**



విశాఖపట్నం, జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : విశాఖలో బోటు ప్రమాద బాధిత మత్స్యకార కుటుంబాలను పరామర్శించిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి... సానుభూతి రాజకీయాలు చేసే ముందు తన ఐదేళ్ల పాలనలో మత్స్యకారులకు చేసిన అన్యాయాలకు సమాధానం చెప్పాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారుల కన్నీళ్లు కనిపించని జగన్‌రెడ్డి... ఇప్పుడు పరామర్శల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం కపట రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు.

మత్స్యకారుల హక్కులను కాలరాసిన వ్యక్తికి... వారి బాధలపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బాధిత కుటుంబాలను పట్టించుకోని జగన్‌రెడ్డి... ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత శవ రాజకీయాలకు తెరలేపడం ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నమేనని మండిపడ్డారు.

**మత్స్యకారుల హక్కులను హరించిన జగన్‌కు పరామర్శించే అర్హత లేదు**

మత్స్యకారుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన జగన్‌రెడ్డి... ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని బాధిత కుటుంబాలను పరామర్శించడానికి వచ్చారని పల్లా ప్రశ్నించారు. సముద్రంలో ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలకు న్యాయం చేయకుండా, పరిహారం ఇవ్వకుండా, సంక్షేమ పథకాలను నిలిపివేసి ఇప్పుడు కపట సానుభూతి ప్రదర్శించడం ప్రజలు గమనిస్తున్నారన్నారు.

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని గొప్పలు చెప్పుకున్న వైసీపీ ప్రభుత్వం... తొలి రెండేళ్లలో వచ్చిన 116 క్లెయిమ్‌లలో 52 క్లెయిమ్‌లను "బడ్జెట్ లేదు" అనే సాకుతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టిందని విమర్శించారు. ఐదేళ్లలో వందలాది మంది మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయినా... ఎంతమందికి పూర్తి పరిహారం ఇచ్చారో చెప్పే ధైర్యం జగన్‌రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. సముద్రంలో ప్రమాదాలకు గురై మరణించిన మత్స్యకారుల సంఖ్యపై కనీసం ఒక అధికారిక శ్వేతపత్రం కూడా విడుదల చేయలేదన్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో రిప్ కరెంట్లు, పాత బోట్లు, భద్రతా లోపాల వల్ల ఏటా ప్రాణాలు కోల్పోతున్నా... ఆ వివరాలు బయటకు వస్తే ప్రభుత్వ వైఫల్యం బట్టబయలవుతుందనే భయంతో అధికారిక సమాచారాన్నే దాచిపెట్టారని ఆరోపించారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు కనీసం ఒక వల కూడా ఇవ్వలేదని, జీవో నెం.30 తీసుకొచ్చి రైతు భరోసా లేదా వాహనమిత్ర పొందుతున్న కుటుంబాలకు మత్స్యకార భరోసా ఇవ్వకుండా వేలాది కుటుంబాలను ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు.

ప్రమాదం జరిగిన వెంటనే స్పందించింది చంద్రబాబు ప్రభుత్వం

ఇటీవల జరిగిన బోటు ప్రమాదంలో మత్స్యకారులు గల్లంతయ్యారన్న సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల (మిగతా 2వ పేజీలో)

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారు: జగన్

**మత్స్యకార మృతుల కుటుంబాలను పరామర్శించిన జగన్**





విశాఖపట్నం, జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : మత్స్యకారులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ నెల 4న జరిగిన పడవ ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. విశాఖపట్నం సమీపంలోని జబ్బర్ తోటలో బాధిత మత్స్యకార కుటుంబాలను, ప్రమాదం నుంచి బయటపడిన చిన్నాను జగన్ పరామర్శించారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. తీరానికి 10 మైళ్ల దూరంలోనే ఘటన జరిగినా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆరుగురు మత్స్యకారులు జలసమాధి అయ్యారని దుయ్యబట్టారు. ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదన్నారు. 5వ తేదీన చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడటంతో అతను బ్రతికి బయటపడ్డాడని తెలిపారు.

ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారని, ఆ నివేదిక కూడా తప్పులతడకగా ఉందన్నారు. ప్రభుత్వానికి మానవత్వం లేదని, ఉంటే రూ.10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకునేవారు కాదన్నారు. ఇప్పటికైనా బాధితులకు రూ.కోటి చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, మత్స్యకార బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన నెలలోపే బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.


## నేటి నుంచి సరికొత్త రైల్వే వెబ్‌సైట్

**నిమిషానికి 1.5 లక్షల టికెట్లు బుక్ చేసుకునేలా సామర్థ్యం పెంపు**
**ఇకపై నచ్చిన సీటు లేదా బెర్త్ ఎంచుకునే సౌకర్యం**
**తగ్గనున్న క్యాప్చా అంతరాయాలు, సులభంగా మారనున్న ఇంటర్‌ఫేస్**

రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) శుభవార్త అందించింది. టికెట్ బుకింగ్ సమయంలో వినియోగదారులు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలకు స్వస్తి పలుకుతూ, భారీ మార్పులతో సరికొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ అప్‌గ్రేడెడ్ వెబ్‌సైట్ రేపటి (జులై 15) నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానుందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు.

ప్రస్తుత వెబ్‌సైట్ పనితీరు నెమ్మదిగా ఉండటం, తరచూ క్యాప్చా సమస్యలు తలెత్తడం, రద్దీ సమయాల్లో (పీక్ అవర్స్) బుకింగ్ ప్రక్రియలో జాప్యం జరగడం వంటి అంశాలపై వినియోగదారుల నుంచి అందిన ఫీడ్‌బ్యాక్ మేరకు ఈ మార్పులు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ నూతన ప్లాట్‌ఫామ్ ద్వారా టికెట్ రిజర్వేషన్లను మరింత వేగంగా, సులభంగా పూర్తి చేయవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

తాజా అప్‌గ్రేడ్‌తో వెబ్‌సైట్ సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం నిమిషానికి 32,000 టికెట్లు మాత్రమే బుక్ అవుతుండగా, ఇకపై నిమిషానికి 1.5 లక్షల టికెట్లను ప్రాసెస్ చేసేలా వ్యవస్థను రూపొందించారు. అదేవిధంగా, ప్రస్తుతం నిమిషానికి 4 లక్షల విచారణలను మాత్రమే నిర్వహించగలుగుతుండగా, కొత్త సిస్టమ్‌లో ఒకేసారి 40 లక్షల ఎంక్వైరీలను హ్యాండిల్ చేసే సామర్థ్యం ఉంటుంది.




దీనివల్ల తత్కాల్ వంటి అధిక డిమాండ్ ఉన్న సమయాల్లో కూడా వెబ్‌సైట్ వేగంగా పనిచేస్తుంది.

ఈ కొత్త వెబ్‌సైట్‌లో ప్రయాణికులు తమకు నచ్చిన సీటు లేదా బెర్త్‌ను ఎంచుకునే సౌకర్యం, వివిధ తేదీల్లో ధరలను పోల్చుకోవడానికి వీలుగా 'ఫేర్ క్యాలెండర్', అన్ని క్లాసుల్లో సీట్ల లభ్యతను ఒకే స్క్రీన్‌పై చూసే సదుపాయం వంటి కీలక ఫీచర్లను జోడించారు. అనవసరమైన పాప్-అప్‌లు, గ్రాఫిక్స్ లేకుండా వెబ్ సైట్ ఇంటర్‌ఫేస్‌ను అత్యంత సరళంగా తీర్చిదిద్దారు. దివ్యాంగులు, విద్యార్థులు, రోగుల కోసం ప్రత్యేక సేవలతో పాటు బహుళ భాషా మద్దతును కూడా కల్పిస్తున్నారు. రైల్‌వన్ యాప్ ద్వారా కూడా ఈ సేవలు ప్రయాణికులకు అందుబాటులో ఉండనున్నాయి.

వేదభేరి

# సంపాదకీయం

## ఉత్సాహాన్ని నింపిన మోదీ పర్యటన

'బలవంతుడ నాకేమని...' అనుకుంటే దశాబ్దాల తరబడి అమెరికా నిర్మించుకుంటూ వస్తున్న పునాదులు కదిలిపోతాయని ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఇంకా జ్ఞానో దయం కాలేదు. నాటో శిఖరాగ్ర సదస్సుకు పోయి ఈసారి కాస్తంత స్నేహపూర్వకంగా మాట్లాడినా అటువైపునుంచి మునుపటి సాన్నిహిత్యం లేదని తుర్కియేలో ముగిసిన ఆ సదస్సు తీరుతెన్నులు చెబుతున్నాయి. అమెరికాతో ఇప్పటికీ సన్నిహిత సంబంధాలే ఉన్న మన దేశం సైతం ఆయన తరచు చేసే ప్రకటనల కారణంగా ఇబ్బంది పడుతోంది. హఠాత్తుగా 'ఇండో--పసిఫిక్' పేరు మారాక లోలోన అసంతృప్తి సరేసరి. ఈ నేపథ్యంలో ఇండో--పసిఫిక్ విషయంలో మన వైఖరిని తేటతెల్లం చేసేలా, మన చొరవను మరింత పెంచేలా ప్రధాని నరేంద్ర మోదీ ఇండొనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఆరు రోజుల పర్యటన ఈ నెల 6న మొదలైంది. ఇప్పటికే ఇండొనేసియా, ఆస్ట్రేలియా పర్యటనలు పూర్తి చేసుకున్న మోదీ శుక్రవారం న్యూజిలాండ్ చేరుకున్నారు. అమెరికా, చైనాలతో... వాటి వైఖరులతో సంబంధం లేకుండా భద్రత, వాణిజ్యం తదితర రంగాల్లో భిన్న దేశాల సహకారం అవసరమని మన దేశం భావించబట్టే ఈ పర్యటన ఖరారైంది. ఈ మూడూ సాగరప్రాంత దేశాలు. ఎప్పుడో 1992లోనే రూపుదిద్దుకున్న 'లుక్ ఈస్ట్' విధానానికి కొనసాగింపుగా మన దేశం 'మహాసాగర్' దార్శనికతను ప్రతిపాదించింది. పరస్పర సంపూర్ణ అభివృద్ధికి ప్రాంతాలవారీ భద్రత, సమగ్రవృద్ధి అవసరమన్నదిదాని సారాంశం. సాధారణ ఆర్థిక సంబంధాలు మొదలుకొని భారీ రక్షణ, ఇంధన భాగస్వామ్యం వరకూ అనేకం దీని పరిధిలోకొస్తాయి. ఆస్ట్రేలియాతో గురువారం కుదిరిన పౌర అణుశక్తి ఒప్పందం చరిత్రాత్మకమైనది. ఇదిగాక ఆధునిక సాంకేతికతలూ, రక్షణ, భద్రత సహకారం, సరఫరా గొలుసు మెరుగు పరచటం తదితరాలకు సంబంధించి మరో 18 ఒప్పందాలు కుదిరాయి. పారిస్‌ఒప్పందం కింద స్వచ్ఛ ఇంధన లక్ష్యం సాధనకు మన అణు రియాక్టర్లకు నిరంతరాయంగా యురేనియం అవసరమవుతుంది. ప్రస్తుతం ఉన్న 7.7 గిగావాట్ల అణు విద్యుత్‌ను 2047కల్లా 100 గిగావాట్లకు పెంచాలని భారత్ నిర్దేశించుకుంది. ఇందుకోసం ప్రపంచ యురేనియం నిక్షేపాల్లో 28 శాతంగల ఆస్ట్రేలియాతో ఒప్పందం కుదరటం కీలక పరిణామం. ప్రపంచ పరిణామాల కారణంగా హఠాత్తుగా నిలిచిపోతున్న ఇంధన సరఫరా తీరును సరిదిద్దటానికి ఎల్ఎన్‌జీ, బొగ్గు, డీజిల్‌వంటి సంప్రదాయ ఇంధన వనరుల విషయంలో పరస్పరం సహకరించుకుంటూ ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవాలని రెండు దేశాలూ నిర్ణయించుకున్నాయి. ఏనాటి నుంచో సాన్నిహిత్యంగల ఇండొనేసియాతో మరిన్ని రంగాల్లో సహకారానికి ఈ నెల 6నుంచి 8వరకూ వరసగా మూడురోజులపాటు కొనసాగిన పర్యటనలో ఒప్పందాలు కుదిరాయి. మన బ్రహ్మోస్, అస్త్ర క్షిపణుల్ని కొనుగోలు చేయటానికి ఇండొనేసియా ఒప్పందం కుదుర్చుకుంది. ఇరు దేశాలూ కలిసి ఇండొనేసియాలోని ఆచే, అండమాన్, నికోబార్ దీవుల్లో నౌకాశ్రయాలను నిర్మించటానికి కూడా అధినేతలిద్దరూ అంగీకరించారు. అలాగే హిందూసముద్రం మొదలుకొని పసిఫిక్ మహాసముద్రంవరకూ పరస్పర సహకారంతో సముద్రజలాల్లో భద్రతను పెంచటానికి ఒప్పందం కుదిరింది. ఇప్పటికే జపాన్, దక్షిణ కొరియాలతో ఉన్న సహకారానికి ఇండొనేసియా కూడా తోడుకావటం వల్ల ఇండో--పసిఫిక్‌లో పటిష్టమైన సమన్వయం ఏర్పడుతుంది. చైనాతో అంటకాగటానికిట్రంప్ ప్రయత్నిస్తున్న దశలో ఇది కీలక పరిణామం. నిరుడు మన దేశంలో న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ పర్యటించినప్పుడు ద్వైపాక్షిక రక్షణ సహకార ఒప్పందం కుదిరింది. దాంతోపాటు మొన్న ఏప్రిల్‌లో రెండు దేశాలూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) కుదుర్చుకున్నాయి. దీన్ని మున్ముందు మరింత విస్తృతపర్చుకోవటానికి ఇప్పటికే ఇరు దేశాలూ నిర్ణయించుకున్నాయి. కూటముల్లో చేరే విషయంలో న్యూజిలాండ్‌కు పెద్దగా ఆసక్తి లేదు.

(మొదటి పేజీ తరువాయి)

## అమెరికా పౌరుడు అరెస్టు

వివరాలను అధికారులు ప్రస్తుతం ధ్రువీకరించుకుంటున్నారు. ఈ అరెస్ట్ వ్యవహారంపై ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయానికి సమాచారం అందించారు. భారత్-నేపాల్ సరిహద్దుల్లోని సోనౌలీ అత్యంత రద్దీగా ఉండే కీలక మార్గాల్లో ఒకటి కావడం గమనార్హం.

## డేటా డ్రివెన్ గవర్నర్స్‌తో రియల్‌టైమ్ రిజల్ట్స్

19 ఎస్ఐపీబీ సమావేశాలు, 52 కేబినెట్ సమావేశాల ద్వారా పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. గత పాలనలో ఏపీపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం పోయింది. మేం అధికారంలోకి వచ్చాక పరిస్థితిలో మార్పు తెచ్చాం. దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా మారింది. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగాయి. వనరుల్ని సమర్థంగా వినియోగించుకోవాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ఏపీని పారిశ్రామికంగా అగ్రగామిగా నిలబెట్టాలనే ఆలోచనతో పనిచేస్తున్నాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ఇలా అన్ని జిల్లాల్లో అపారమైన వనరులు, పెట్టుబడి అవకాశాలు ఉన్నాయి. రేర్ ఎర్త్ మినరల్స్, సిలికా, గ్రానైట్ , బాక్సైట్ సహా విలువైన వనరులను వాల్యూ అడిషన్ చేసేలా ప్రణాళికలు రూపొందించాం. ఇన్నోవేషన్ ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. టెక్నాలజీ, వనరులు, నాలెడ్జి మన దగ్గర ఉన్నాయి. దానిని అందిపుచ్చుకునే నాయకత్వం మనకు కావాలి. పాలసీలు తీసుకురావటం సులభమే అయినా వాటిని అమలు చేయటమే అత్యంత కీలకం. ఇక నుంచి నెల వారీ ఆర్థిక నివేదికల ద్వారా ముందుకు వెళ్లాలని నిర్ణయించాం. ప్రతీ నెలా ఒకసారి కార్యదర్శులు, హెచ్‌వోడీల సమావేశం ద్వారా ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించుకుందాం." అని ముఖ్యమంత్రి అన్నారు.

అర్జీలు వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన

'గత పాలనలో కొన్ని ప్రభుత్వ శాఖల్లో పనితీరు మెరుగ్గా లేకపోవటంతో ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు వచ్చాయి. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ ద్వారా ఈ అర్జీలను వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన కలిగించాలి. గత పాలకుల వల్ల రెవెన్యూ శాఖలో అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. భూ వివాదాలకు సంబంధించిన అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి వచ్చింది. పీజీఆర్ఎస్‌లో జీరో పెండెన్సీ అనేది లక్ష్యం కావాలని అన్ని శాఖలకూ నిర్దేశిస్తున్నాను. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి లాంటి ప్రాంతాల్లో భూ సమస్యల్ని పరిష్కరించాం. రీసర్వే ప్రక్రియ ద్వారా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రతీ నెలా 9 తేదీన పంపిణీ చేస్తున్నాం. ఇంకా 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ శాఖలు అర్జీల పరిష్కారం కోసం నిబంధనల్లో మార్పులు తీసుకురావడం, లేదంటే చట్టాలను సవరించే అంశంపై విశ్లేషణ చేయాలి. మెరుగ్గా పనిచేస్తే 15 శాతం వృద్ధి రేటును సాధించే అవకాశం ఉంది. పాలన సులభతరం చేసేందుకు, రెవెన్యూ వసూళ్లు పెంచుకునేలా కొన్ని ఏఐ టూల్స్ కూడా రూపొందించాం. ఈ ఏడాది వివిధ ప్రభుత్వ శాఖల్లో 24 శాతం మేర రెవెన్యూ వసూళ్లు పెరిగాయి. జీఎస్డీపీ వృద్ధిరేటు 2017తో పోలిస్తే గత ఏడాదిలో 20 శాతం మేర పెరిగింది. కీలకస్థానాల్లో పనిచేస్తున్న కొందరు వ్యక్తులు అభివృద్ధి నిరోధకులుగా పనిచేయటం సరికాదని హెచ్చరిస్తున్నానను.' అని ముఖ్యమంత్రి అన్నారు.

నాలుగు గోడలు దాటి వెళ్లాలి

ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోనూ పర్యటించాలి. ప్రజల సమస్యలు, వాస్తవాలు తెలియాలంటే క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే. వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలి. మూడో ఏడాదిలోకి అడుగు పెట్టినప్పటికీ విద్యుత్ ఛార్జీలను పెంచలేదు. ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని చెప్పిన మాటను నిలబెట్టుకున్నాం. తొలిసారి ట్రూ డౌన్‌ను కూడా అమలు చేస్తున్నాం. పట్టిసీమ నీటితో గోదావరి నుంచి కృష్ణా డెల్టా ఆయకట్టుకు నీరు అందించగలుగుతున్నాం. రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ కార్యక్రమాలు చక్కగా జరుగుతున్నాయి. ఎల్‌నినో కారణంగా తలెత్తిన తీవ్ర వర్షాభావ పరిస్థితులపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలి. ఒక మంచి అధికారి సమస్యలను పరిష్కారిస్తే...అద్భుతంగా పనిచేసే అధికారి అసలు సమస్యలనేవే తలెత్తకుండా చూస్తారనే కోణంలో అందరూ పనిచేయాలి. ముందుచూపుతో అంతా పనిచేస్తేనే మెరుగైన పాలనను, ఫలితాలను ప్రజలకు అందించగలం. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఆగస్టు 14 తేదీన అనకాపల్లికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేస్తాం. సెప్టెంబరు 1వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను కూడా జాతికి అంకితం చేస్తాం. రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను కూడా ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం. ప్రతీ నెలా జరిగే మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ఆధారంగా ఎప్పటికప్పుడు సమీక్షించుకుని ముందుకు వెళ్దాం. రాష్ట్రాభివృద్ధిలో సహకరిస్తున్న అధికారులు, ఉద్యోగులందరికీ అభినందనలు తెలియచేస్తున్నానని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ సమావేశానికి మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఆయా శాఖల కార్యదర్శులు, హెచ్ఓడీలు హాజరయ్యారు

## మత్స్యకారుల కన్నీళ్లతో రాజకీయాలు మానాలి

మేరకు అధికారులు, కోస్ట్‌గార్డ్, నేవీ, సంబంధిత శాఖలు యుద్ధప్రాతిపదికన రంగంలోకి దిగాయని పల్లా తెలిపారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ఇప్పటికీ నిరంతర గాలింపు కొనసాగుతోందన్నారు. ప్రమాదం జరిగిన 72 గంటల్లోపే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆరు కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం మంజూరు చేశారని తెలిపారు. ఇందులో రూ.5 లక్షలు మత్స్యశాఖ నుంచి, మరో రూ.5 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదల చేశారని చెప్పారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన కారి చిన్న కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు.

ముందుగా తెలిసింది వైసీపీ నేతలకే... అయినా పోర్టుకు సమాచారం ఎందుకు ఇవ్వలేదు?

బోటు ప్రమాదంపై మరో కీలక అంశాన్ని పల్లా ప్రస్తావించారు. ప్రమాద సమాచారం ముందుగా వైసీపీ నాయకులకు ఎలా తెలిసిందని ప్రశ్నించారు. జానకిరామ్‌కు ప్రమాద సమాచారం ఎప్పుడు తెలిసింది? బాధిత కుటుంబాల ఆధార్ కార్డులు, ఫొటోలు సేకరించి అదే రాత్రి మీడియాకు విడుదల చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ప్రమాదం గురించి ముందుగానే సమాచారం తెలిసి కూడా గంగవరం పోర్టు అధికారులకు ఎందుకు తెలియజేయలేదని నిలదీశారు. చివరకు బోటు ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మణరావు సమాచారం ఇవ్వడంతోనే పోర్టు యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలు వేగవంతం చేశారని పేర్కొన్నారు.

మత్స్యకారుల కన్నీళ్లపై రాజకీయాలు చేయొద్దు

జగన్‌రెడ్డి విశాఖ పర్యటనలో కోస్ట్‌గార్డ్, నేవీ చర్యలను ప్రశ్నించడం అత్యంత బాధ్యతారాహిత్యమని పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. దేశ భద్రత కోసం అహర్నిశలు సేవలందిస్తున్న కోస్ట్‌గార్డ్, భారత నౌకాదళం వంటి అత్యున్నత సంస్థలను రాజకీయాల కోసం విమర్శించడం సమంజసం కాదన్నారు. గల్లంతైన మత్స్యకారుల కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి గాలింపు చర్యలు కొనసాగిస్తున్న జవాన్ల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడడం దేశ రక్షణ దళాలను అవమానించడమేనని అన్నారు. గంగవరం పోర్టుకు సుమారు 10 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదం జరిగినప్పటికీ, సంబంధిత అధికారులకు సమాచారం ఆలస్యంగా చేరిందని చెప్పారు. సమాచారం అందిన వెంటనే కోస్ట్‌గార్డ్, నేవీ, పోర్టు అధికారులు సమన్వయంతో విస్తృత స్థాయిలో గాలింపు చేపట్టారని గుర్తు చేశారు. అలాంటి సమయంలో వారిపై విమర్శలు చేయడం దురదృష్టకరమన్నారు.

ఒక కోటి ప్రకటన వెనుక మానవత్వమా... ఓట్ల రాజకీయమా?

మత్స్యకారులపై నిజంగా ప్రేమ ఉంటే అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఎందుకు చూపలేదని పల్లా ప్రశ్నించారు. నాడు ప్రమాదాలు జరిగినప్పుడు కనీసం పార్టీ తరఫున లక్ష రూపాయలు కూడా ప్రకటించని జగన్‌రెడ్డి... ఇప్పుడు ఒక్కసారిగా రూ.1 కోటి ప్రకటించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటని నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు బాధిత కుటుంబాలకు న్యాయం చేయకుండా, పరిహారం ఇవ్వకుండా, డెత్ సర్టిఫికెట్లు కూడా అందకుండా చేసిన ప్రభుత్వం... ఇప్పుడు కోట్లు ప్రకటిస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇది మానవత్వం కాదని, రాజకీయ స్వలాభం కోసం చేస్తున్న ప్రచారమని విమర్శించారు.

తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు

హోంమంత్రి వంగలపూడి అనిత, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించలేదని, నాయకులు అందుబాటులో లేరని వైసీపీ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పల్లా స్పష్టం చేశారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే వీడియో కాల్ ద్వారా బాధిత కుటుంబాలతో మాట్లాడి పరామర్శించారని తెలిపారు. సంబంధిత అధికారులతో నిరంతరం మాట్లాడి పరిస్థితిని సమీక్షించారని చెప్పారు.

ముందుగా స్పందించింది ముఖ్యమంత్రి కార్యాలయమేనని, సీఎం కార్యాలయం నుంచే కోస్ట్‌గార్డ్, నేవీ, జిల్లా యంత్రాంగానికి సమాచారం వెళ్లి సహాయక చర్యలు వేగవంతమయ్యాయని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతం గంగవరం పోర్టుకు సమీపంలోనే ఉన్నప్పటికీ, నాలుగు రోజులుగా ఈ విషయం స్థానికులకు తెలిసి కూడా సంబంధిత అధికారులకు ఎందుకు వెంటనే తెలియజేయలేకపోయారని పల్లా ప్రశ్నించారు. ప్రాణాలకు సంబంధించిన అత్యవసర సమయంలో రాజకీయాలకే ప్రాధాన్యం ఇచ్చారా... లేక రక్షణ చర్యలకు ప్రాధాన్యం ఇచ్చారా అని నిలదీశారు.

ఫిషింగ్ హార్బర్ అగ్నిప్రమాదంలో కనిపించని జగన్... ఇప్పుడు పరామర్శల డ్రామా

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 45 బోట్లు అగ్నికి ఆహుతై వందలాది కుటుంబాలు తీవ్రంగా నష్టపోయినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌రెడ్డి ఒక్కసారి కూడా బాధితులను పరామర్శించలేదని పల్లా గుర్తు చేశారు. బాధితుల కన్నీళ్లు తుడవని వ్యక్తి... ఇప్పుడు మత్స్యకారులపై కపట ప్రేమ చూపించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు.

మత్స్యకారుల ఆస్తులపై కన్నేసిన వైసీపీ

వైసీపీ పాలనలో మత్స్యకారుల హక్కులే కాదు... వారి ఆస్తులపైనా కన్నేశారని పల్లా ఆరోపించారు. విశాఖపట్నం పెదజాలారిపేటలోని 20.27 ఎకరాల విలువైన మత్స్యకారుల భూములను భూసేకరణ పేరుతో స్వాధీనం చేసుకునేందుకు అప్పటి ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. సుమారు రూ.2,500 కోట్ల విలువైన ఆ భూములను కోల్పోయే పరిస్థితి తీసుకొచ్చిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసి మత్స్యకారుల హక్కులను కాపాడిందని తెలిపారు.

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి ప్రమాద ఘటనలో బాధితులకు న్యాయం చేయకుండా కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని పల్లా ఆరోపించారు. మొదట వేరే వారిపై కేసులు పెట్టి, తర్వాత సీసీటీవీ దృశ్యాలు బయటకు రావడంతో నిజాలు వెలుగులోకి వచ్చాయని అన్నారు. నేడు పరామర్శల పేరుతో రాజకీయాలు చేసే ముందు... ఆ బాధిత కుటుంబాలను ఎందుకు పరామర్శించలేదో జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మత్స్యకారుల సంక్షేమాన్ని మాటల్లో కాకుండా చేతల్లో నిరూపిస్తున్న ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వమని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురిచేసి పెండింగ్‌లో పెట్టిన 63 ఎక్స్‌గ్రేషియా క్లెయిమ్‌లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరించి, రూ.3.15 కోట్లను నేరుగా బాధిత కుటుంబాల ఖాతాల్లో జమ చేసిందన్నారు.

అదేవిధంగా వైసీపీ ప్రభుత్వం విడుదల చేయకుండా నిలిపివేసిన రూ.9.90 కోట్ల డీజిల్ సబ్సిడీ బకాయిలను కూడా కూటమి ప్రభుత్వం చెల్లించి, 20,812 మత్స్య పడవలకు ప్రత్యక్ష లబ్ధి చేకూర్చిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పెండింగ్‌లు పేరుకుపోయేలా చేసిన వైసీపీకి, అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించిన కూటమికి మధ్య ఉన్న తేడా ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

జీవో-217తో జాలర్ల పొట్టకొట్టింది వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.217 మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసిన నిర్ణయంగా చరిత్రలో నిలిచిపోతుందని పల్లా విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మత్స్యకార సహకార సంఘాలకు కేటాయించిన చెరువులు, రిజర్వాయర్లను ఆన్‌లైన్ వేలాల పేరుతో పార్టీ అనుచరులు, దళారులకు అప్పగించి వేలాది మంది మత్స్యకారుల జీవనాధారాన్ని దెబ్బతీశారన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీని నిలిపివేయడంతో కులవృత్తి తీవ్రంగా దెబ్బతిందని, అనేక కుటుంబాలు ఉపాధి కోసం వలసబాట పట్టాల్సి వచ్చిందన్నారు. మత్స్యకారులను వారి సొంత గ్రామాల్లోనే కూలీలుగా మార్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని తీవ్రంగా విమర్శించారు.

వైసీపీ పాలనలో ప్రమాదాల్లో మరణించిన మత్స్యకారుల కుటుంబాలు ఐదేళ్ల పాటు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా కనీసం డెత్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేదని పల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. డెత్ సర్టిఫికెట్లు లేక ఎక్స్‌గ్రేషియా ఇవ్వని జగన్ రెడ్డి, ఇప్పుడు బాధిత కుటుంబాలపై ప్రేమ నటించడం ప్రజలను అవమానించడమేనని విమర్శించారు.

మత్స్యకారుల సంక్షేమంలో కొత్త అధ్యాయం రాస్తున్న కూటమి ప్రభుత్వం

మత్స్యకారుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుందని పల్లా తెలిపారు. మెకనైజ్డ్, మోటరైజ్డ్ పడవలకు లీటరుకు రూ.9 చొప్పున డీజిల్ సబ్సిడీ అందిస్తున్నామని చెప్పారు. మెకనైజ్డ్ పడవలకు నెలకు 3,000 లీటర్లు, మోటరైజ్డ్ పడవలకు 300 లీటర్ల వరకు సబ్సిడీ వర్తిస్తోందన్నారు. 2026-27 బడ్జెట్‌లో 21,935 పడవలకు డీజిల్ సబ్సిడీ కోసం రూ.50 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రూ.3,256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్లు, రూ.157 కోట్లతో 8 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద 4,560 ట్రాన్స్‌పాండర్లను అందించి సముద్రంలో మత్స్యకారుల భద్రత, సమాచార వ్యవస్థను బలోపేతం చేశామని చెప్పారు. 2025-26లో 816 పడవలు, వలలను పంపిణీ చేయడంతో పాటు, మరణించిన మత్స్యకార కుటుంబాలకు ఇప్పటివరకు దాదాపు రూ.9 కోట్ల ఎక్స్‌గ్రేషియా అందించామని తెలిపారు.

విద్యుత్ సబ్సిడీ విషయంలో జోన్--నాన్‌జోన్ పేరుతో వేలాది మంది మత్స్యకారులకు జగన్ ప్రభుత్వం అన్యాయం చేసిందని పల్లా ఆరోపించారు. 2018-19లో 52,946 మందికి విద్యుత్ సబ్సిడీ అందగా, వైసీపీ పాలనలో అది 47,091 కనెక్షన్లకు పడిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వివక్షను పూర్తిగా తొలగించి నిలిచిపోయిన 54,033 సబ్సిడీ విద్యుత్ కనెక్షన్లను పునరుద్ధరించిందని, అదనంగా 12,500 కొత్త సబ్సిడీ కనెక్షన్లు మంజూరు చేసి మొత్తం 62,181 సబ్సిడీ విద్యుత్ కనెక్షన్లను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.1,150 కోట్ల సబ్సిడీ భారం భరిస్తోందని చెప్పారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని 2025 ఏప్రిల్ 26న రూ.258.36 కోట్లతో 1,29,178 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించిందని పల్లా తెలిపారు. గతంలో వేట నిషేధ కాలంలో ఇచ్చే సాయాన్ని భారీగా పెంచి రూ.20 వేలకు చేర్చడం మత్స్యకారుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 2026-27 సంవత్సరానికి సంబంధించి 1,34,298 మత్స్యకార కుటుంబాలకు వేట నిషేధ కాల భృతి అందిస్తున్నామని, మే 19న రూ.286 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. రెండో విడతలో 1,30,796 కుటుంబాలకు రూ.262 కోట్ల సాయం అందిస్తున్నామని చెప్పారు.

## టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయాలు



.తిరుపతిజూలై 14 (వేదభేరి ప్రతినిధి) : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. టీటీడీ పరిధిలోని వివిధ ట్రస్టులు, పథకాలకు విరాళాలు ఇచ్చే దాతలకు కల్పించే ప్రత్యేక సౌకర్యాలు (ప్రివిలేజెస్)లో మార్పులు చేస్తున్నట్లు ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రకటించారు. ఈ కొత్త నిబంధనలు మంగళవారం అర్ధరాత్రి నుంచే అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన బోర్డు సమావేశం అనంతరం ఆయన ఈవో ముద్దాడ రవిచంద్రతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు.

విరాళాల నిర్వహణలో మరింత పారదర్శకత, ఏకరూపత తీసుకురావడమే లక్ష్యమని ఆయన తెలిపారు. అయితే, ఇప్పటికే విరాళాలు సమర్పించిన పాత దాతలకు ప్రస్తుతం అమల్లో ఉన్న సౌకర్యాలు యథావిధిగా కొనసాగుతాయని ఛైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో భక్తుల సౌకర్యార్థం, ఆలయాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ధర్మప్రచారం వంటి అంశాలపై అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు.

సమావేశంలో తీసుకున్న మరిన్ని ముఖ్యమైన నిర్ణయాలు

భక్తుల కోసం శాశ్వత షెల్టర్లు: తిరుమలకు వచ్చే సామాన్య భక్తుల సౌకర్యార్థం, సర్వదర్శనం (రూణ) టోకెన్లు పొందిన వారు వేచి ఉండేందుకు శాశ్వత ఏర్పాట్లు చేయాలని బోర్డు నిర్ణయించింది. ఇందుకోసం రూ.6.31 కోట్ల వ్యయంతో ఆళ్వార్ ట్యాంక్ సమీపంలో శాశ్వత షెల్టర్లు, క్యూలైన్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన టెండర్లకు ఆమోదం తెలిపింది. డ్యామ్‌ల పటిష్టతకు చర్యలు: తిరుమలలోని కుమారధార, పసుపుధార డ్యామ్‌ల పటిష్టతకు చర్యలు చేపట్టారు. ఈ డ్యామ్‌ల వద్ద డబుల్ లేన్ వంతెన నిర్మాణానికి రూ.2.77 కోట్లు మంజూరు చేస్తూ బోర్డు ఆమోదముద్ర వేసింది.

హరిత ఇంధన ప్రోత్సాహం: తిరుమలలో హరిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా కీలక అడుగు వేశారు. జీఎన్‌సీ సమీపంలో 800 కిలోవాట్ల సామర్థ్యం గల విండ్ టర్బైన్ జనరేటర్‌ను ఏర్పాటు చేసేందుకు అంగీకరించారు. విష్ విండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ దీన్ని విరాళంగా ఏర్పాటు చేసి, 25 సంవత్సరాల పాటు టీటీడీకి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయనుంది. ఎస్వీ మ్యూజియం ప్రవేశ రుసుము: తిరుమలలోని ఎస్వీ మ్యూజియం సందర్శనకు ప్రవేశ రుసుమును నిర్ణయించారు. 12 ఏళ్లు పైబడిన సందర్శకుల నుంచి జీఎస్టీతో కలిపి రూ.50 వసూలు చేయాలని తీర్మానించారు. భవిష్యత్తులో మ్యూజియం నిర్వహణ బాధ్యతలను టాటా సంస్థకు అప్పగించే అంశంపై ఆ సంస్థను సంప్రదించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. వ్యర్థాల శాస్త్రీయ శుద్ధి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా, తిరుమల కాకులమానుతిప్ప సమీపంలో పేరుకుపోయిన పాత వ్యర్థాల సమస్యకు పరిష్కారం కనుగొన్నారు. 25 ఏళ్లకు పైబడిన ఘన వ్యర్థాలను బయో-రిమీడియేషన్, బయో-మైనింగ్ పద్ధతుల ద్వారా శాస్త్రీయంగా శుద్ధి చేసేందుకు రూ.5 కోట్లు మంజూరు చేశారు.

అగ్నిమాపక వ్యవస్థల నిర్వహణ: భక్తుల భద్రతకు పెద్దపీట వేస్తూ తిరుమల, తిరుపతిలోని టీటీడీ ఆలయాలు, విశ్రాంతి భవనాల్లో అగ్నిమాపక వ్యవస్థల సమగ్ర నిర్వహణ కోసం రూ.2.35 కోట్లతో పనులు నిరంతరాయంగా కొనసాగించాలని నిర్ణయించారు.

పాత భవనాల స్థానంలో కొత్తవి: తిరుమలలోని టీబీసీ, ఏటీసీ విశ్రాంతి భవనాల వద్ద ఉన్న 12 పాత భవనాలను తొలగించి, వాటి స్థానంలో దాతల సహకారంతో నూతన భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. 2027 క్యాలెండర్లు, డైరీల ముద్రణ: 2027వ సంవత్సరానికి సంబంధించి 10 లక్షల డైరీలు, 13.50 లక్షల 12 పేజీల క్యాలెండర్లు, 75 వేల 6 పేజీల క్యాలెండర్ల ముద్రణకు బోర్డు ఆమోదం తెలిపింది. ఆక్టోపస్ బేస్ క్యాంప్‌లో సదుపాయాలు: తిరుమల ఆక్టోపస్ బేస్ క్యాంప్‌లో అదనపు మౌలిక సదుపాయాల కల్పనకు, ఎఫ్ఎంఎస్ సేవల కోసం రూ.2.91 కోట్లు మంజూరు చేశారు.

ఒంటిమిట్టలో స్వర్ణ కవచాలు: ఒంటిమిట్ట శ్రీ సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి వారి మూల విరాట్టులకు బంగారు కవచాలను తయారు చేయాలని నిర్ణయించారు.

# లిక్విడ్ గంజాయి సరఫరా ఐదుగురి అరెస్ట్




గొలుగొండ , జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : గంజాయిని లిక్విడ్ రూపం లోకి మార్చి (హాషిష్ ఆయిల్) సరఫరా చేస్తున్న ఐదుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాస రావు తెలిపిన వివరాల ప్రకారం ఏటిగైరంపేట వద్ద గొలుగొండ ఎస్సై రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో నిందితు లను అదుపులోకి తీసు కున్నారు.

పోలీసులు నిందితుల వద్ద నుంచి 2 కిలోల హాషిష్ ఆయిల్,2 కిలోల గంజాయి, 3మోటార్ బైకులు,5మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసు కున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగి స్తున్నట్లు పోలీసులు తెలిపారు ఈ కార్యక్రమంలో సి ఐ రేవతమ్మ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

# “స్వచ్ఛమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది

## సీఎస్‌సీ నిర్మాణాన్ని నాణ్యతతో పూర్తి చేయాలి “:ఎంపీడీవో ఎ. రాజు



ఆలమూరు, జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు స్వచ్ఛ భారత్ మిషన్ నిధులతో ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న రెండు కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ (సీఎస్‌సీ) నిర్మాణ పనులను ఎంపీడీవో ఎ. రాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు పరిశుభ్రమైన పారిశుద్ధ్య సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని తెలిపారు. “స్వచ్ఛమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది. అందుకే నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలి” అని అధికారులకు సూచించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రతి దశను పర్యవేక్షించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా అన్ని సౌకర్యాలతో ఈ కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ను సిద్ధం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు తొరటి లక్ష్మణరావు, వాడపల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సలాది నాగేశ్వరరావు, సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ తుది విడత కౌన్సిలింగ్ ప్రారంభం



ఎచ్చెర్ల జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ప్రవేశ కన్వీనర్ నారాయణరావు పాలిటెక్నిక్ 2006 ఫైనల్ పేజ్ కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల అయిందని తెలిపారు. విద్యార్థినివిద్యార్థులు ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు ఆన్లైన్లో ప్రాసెసింగ్ ఫీజుచెల్లించాలని అన్నారు. అదే రోజు నుంచి 19వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ 20 వరకు ఆప్షన్ ఎంట్రీ,ఉంటుందని అన్నారు. 21న వెబ్సైట్ ఆప్షన్ మార్పునకు అవకాశం ఉంటుందని 24నసీట్లు కేటాయిస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకోవాలని అన్నారు.

# లీలా సుందరయ్య కాలనీలో మంచినీటి కోసం ఖాళీ బిందెలతో ర్యాలీ




ఆరిలోవ , జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : విశాఖపట్నం జీవిఎంసీ 12వ వార్డు ఆరిలోవ ప్రాంతంలోని లీలా సుందరయ్య నగర్ లో మంచినీటి సమస్యపై ఆ ప్రాంత మహిళలు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో ర్యాలీ నిర్వహించడం జరిగింది. రోజు తప్పించి రోజు మంచినీళ్లు కుళాయిలు వస్తున్నాయని, తక్కువ నీరు సరఫరా చేస్తున్నారని దీనివలన ఈ ప్రాంతంలోని ప్రజానీకం మంచినీళ్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఆరిలోవ పి ఐ సి పాయింట్ నుండి దుర్గాలమ్మ గుడి గుడి వద్ద జీవీఎంసీ వాటర్ సప్లై ఆఫీస్ వరకు ఈ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని ఉద్దేశించి మహిళా సంఘం జోన్ కార్యదర్శి డి. కొండమ్మ మాట్లాడుతూ కోటమ్మ ప్రభుత్వం ఈ వేసవికాలంలో ఆరిలోవ ప్రాంతంలోని ప్రజానీకానికి మంచినీళ్లు అందించడంలో విఫలమైందని విమర్శించారు. ఇప్పటికే కార్పొరేట్ హాస్పిటల్స్ వలన ఈ ప్రాంతంలోని బోర్వెల్స్ అడుగంటాయని దీనికి తోడు జీవీఎంసీ మంచినీళ్లు సప్లై కూడా సరిగా చేయలేదని అన్నారు. ప్రతిరోజు ట్యాంకర్ల ద్వారా ఈ ప్రాంత ప్రజానీకానికి సరిపడా మంచినీళ్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే ఆరిలోవలో అనేక ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి ఉందని జీవీఎంసీ ద్వారా ప్రతిరోజు మంచినీళ్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ముడసరిలోవ ఎదురుగా గూగుల్ డేటా సెంటర్ తీసుకువస్తే ముడుసుల్లో రిజర్వాయర్ పూర్తిగా ఎండిపోయి ఆరులోవ ప్రాంతంలోని లక్ష మంది ప్రజానీకం మంచినీటి సమస్యతో ఇబ్బంది పడతారని అన్నారు.

ఈ ప్రాంతం నుండి గూగుల్ డేటా సెంటర్ తరలించాలని డిమాండ్ చేశారు. ఆరిలోవలోని అన్ని కాలనీలకు జీవీఎంసీ ప్రతిరోజు సరిపడే మంచినీళ్లు కుళాయి ద్వారా సరఫరా చేయాలని అన్నారు. మంచినీటి సమస్య పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని జీవీఎంసీ అధికారులను, కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.శంకర్, ఐద్వా నాయకులు సూర్య మని,బి.భారతి, డి.కొండమ్మ, ఆర్.రమణమ్మ, వి.కాంతం ఈ ప్రాంతంలోని మహిళలు పాల్గొన్నారు.

# విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి: సీఐటీయూ

విశాఖపట్నం, జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : ఆంధ్ర రాష్ట్రంలో విద్యుత్ సంస్థలో పనిచేస్తున్నటువంటి కాంట్రాక్ట్ కార్మికులను విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని ఏపీ ఈపీడీసీఎల్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటీయూ గౌరవాధ్యక్షులు ఆర్కే ఎస్ వి కుమార్ డిమాండ్ చేశారు.

అనేక సంవత్సరాల నుండి విద్యుత్ సబ్స్టేషన్ లో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, పీస్ రేట్ విధానంలో అతి తక్కువ వేతనాలతో కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీరందరినీ రెగ్యులర్ చేస్తామని సంస్థలో విలీనం చేస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంది గాని ఆ పని జరగడం లేదన్నారు. విద్యుత్ పోల్స్ మీద పనిచేస్తున్నటువంటి కార్మికులు ప్రమాదాలు జరిగి చనిపోతున్నా వారిని పట్టించుకునే వారు లేరన్నారు. సంవత్సరాల తరబడి స్టోర్స్ లో హమాలీస్ గా లోడింగ్ అన్లోడింగ్ చేస్తున్న కార్మికులకు అతి తక్కువ కూలి చెల్లిస్తురన్నారు. సెక్షన్ ఆపరేటర్లు, ఏటీపీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు చాలీచాలని జీతాలతో జీవితాలను గడపాల్సి వస్తుందన్నారు. మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు.

అందుకనే వీరందరి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కనీస వేతనాలు అమలు చేయాలని పిఆర్సి ని ప్రకటించాలని, విద్యుత్ ప్రైవేటీకరణ చర్యలు ఆపాలనే డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా రేపు జూలై 15వ తేదీ నాడు అన్ని సీఎండీ ఆఫీసుల వద్ద ధర్నాలు చేస్తున్నామని తెలిపారు.

దానిలో భాగంగా ఏపీ ఈపీడీసీఎల్ సిఎండి కార్యాలయం వద్ద రేపు బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే ధర్నాకు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, పర్మనెంట్ కార్మికులు, పీస్ రేట్ కార్మికులు రావలసిందిగా కోరారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే ఆగస్టు 10 చలో విద్యుత్ సౌధా నిర్వహిస్తామని తెలియజేశారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన ఎస్సీ కమిషన్



ఎచ్చెర్ల , జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వ,విద్యాలయాన్నిరాష్ట్ర ప్రభుత్వ షెడ్యూల్ కులాల కమిషన్ సభ్యుడు రావాడ సీతారాం సందర్శించారు. వర్సిటీలో రిజర్వేషన్ అమలు తీరును పరిశీలించారు. రిజిస్టర్ అడ్డయ్య యూనివర్సిటీలో ఎస్సీ రిజర్వేషన్ అమల తీరును ఆయనకు వివరించారు. అధ్యాపక బోధ నేతర సిబ్బంది పోస్టులు భర్తీలు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తున్నామని ఆయనకి తెలిపారు. దీనిపై ఎస్సీ కమిషన్ సభ్యుల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు మాట్లాడుతూ పోస్టులు భర్తీ లోఉన్నత విద్యలో సీట్లు కేటాయింపు పలు అంశాలు లలో రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేయాలని ఆయన సూచించారు. షెడ్యూల్ కులాల వారికి ఉన్నత విద్యలో తగిన అవకాశాలు కల్పించాలని ఉద్యోగులు భర్తీలో న్యాయం జరిగేలా వర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలు తప్పనిసరిగా పాటిస్తామని రిజిస్టర్ అడ్డయ్య తెలిపారు.

# పపంచ స్ట్రోక్ సంస్థ (డబ్ల్యుఎస్ఒ) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా డా. పి. విజయ ఎన్నిక



గుంటూరు, జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : గుంటూరుకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్టు, లలితా పి.వి.ఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ న్యూరోసైన్సెస్ విభాగాధిపతి, అంకినీడు అడ్వాన్స్ స్ట్రోక్ సెంటర్ డైరెక్టర్, న్యూరోసైంటిస్ట్స్ అసోసియేషన్, గుంటూరు అధ్యక్షురాలు డా. పి. విజయ (MD.,DM.,FWSO.,FIAN.,FIAMS) ప్రపంచ స్ట్రోక్ సంస్థ (World Stroke Organization - WSO) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యురాలిగా ఎన్నికయ్యారు.

ప్రపంచవ్యాప్తంగా 95 దేశాలకు చెందిన 3,500 మంది ఔూ సభ్యుల ద్వారా ఎన్నికైన 18 మంది ప్రతిష్టాత్మక డైరెక్టర్లలో డా. విజయ ఒకరిగా ఎన్నిక కావడం విశేషం. అమెరికా, యూరప్, ఆఫ్రికా/మిడిల్ ఈస్ట్ లతో పాటు ఉన్న 4 ప్రధాన ఖండాల గ్రూపులలో ఒకటైన ఆసియా–ఓషియానియా ప్రాంతానికి డాక్టర్ విజయ గారు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం) అత్యుత్తమ చికిత్సలు, పరిశోధన, ప్రజలలో అవగాహన మరియు ప్రజారోగ్య విధానాల రూపకల్పనలో ఆమె అందించిన విశిష్ట సేవలకు గాను ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించింది.

ప్రపంచ స్ట్రోక్ సంస్థ (WSO) అనేది ప్రపంచవ్యాప్తంగా పక్షవాత నివారణ, అత్యాధునిక చికిత్స, పునరావాసం, పరిశోధన, వైద్య విద్య మరియు ప్రజల్లో అవగాహన పెంపుదల కోసం పనిచేస్తున్న అత్యున్నత అంతర్జాతీయ సంస్థ.

డా. విజయ గారు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యురాలిగా 2026 నుంచి 2030 వరకు నాలుగేళ్లపాటు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ పదవిలో ఆమె ప్రపంచవ్యాప్తంగా స్ట్రోక్ వైద్య విధానాల రూపకల్పన, అంతర్జాతీయ చికిత్స మార్గదర్శకాల (Guidelines) అభివృద్ధి, విద్యా కార్యక్రమాల నిర్వహణ, ప్రపంచ స్ట్రోక్ కార్యక్రమాల పర్యవేక్షణ, వివిధ దేశాల స్ట్రోక్ నిపుణులు మరియు జాతీయ స్ట్రోక్ సంఘాల మధ్య సమన్వయం, అలాగే స్ట్రోక్ అవగాహన మరియు సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు. నూతన బోర్డు తొలి సమావేశంలో పాల్గొనడానికి ఈ ఏడాది అక్టోబర్లో ఆమె దక్షిణ కొరియాలోని సియోల్కు వెళ్లనున్నారు.

భారతదేశంలో ఆధునిక స్ట్రోక్ వైద్య సేవలకు శ్రీకారం చుట్టిన ప్రముఖుల్లో డా. విజయ ఒకరు. ఆమె 1996లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో మొట్టమొదటి స్ట్రోక్ యూనిట్ను ప్రారంభించారు. ముంబై, చెన్నై తర్వాత దేశంలో స్థాపించబడిన మూడవ స్ట్రోక్ యూనిట్. ఆమె నాయకత్వంలో ఈ కేంద్రం ఎంతో అభివృద్ధి చెంది, భారతదేశంలోనే మొట్టమొదటి అడ్వాన్స్ స్ట్రోక్ సెంటర్ (1st Accredited Advanced Stroke Center) గా గౌరవాన్ని అందుకుంది.

డా. విజయతో పాటు ఆమె నాయకత్వంలోని అంకినీడు అడ్వాన్స్ స్ట్రోక్ సెంటర్ అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకుంది. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రదానం చేసే పాల్ డడ్లీ వైట్ ఇంటర్నేషనల్ స్కాలర్ అవార్డు, అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ (AAN) యొక్క ఏ.బి. బేకర్ అవార్డు, అలాగే ప్రపంచ స్ట్రోక్ సంస్థ––ఏంజెల్స్ కార్యక్రమం నుంచి వరుసగా డైమండ్ స్టేటస్ అవార్డులు అందుకోవడం విశేషం.

ప్రపంచ స్ట్రోక్ సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా డా. విజయ ఎన్నిక కావడం భారతదేశంలో స్ట్రోక్ వైద్యరంగ అభివృద్ధికి ఆమె అందించిన అసాధారణ సేవలకు అంతర్జాతీయ గుర్తింపుగా నిలిచింది. ఈ అరుదైన గౌరవం లలితా పి.వి.ఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఆంధ్రప్రదేశ్ వైద్య సమాజం మరియు యావత్ దేశానికి గర్వకారణమని పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# గ్రుమ్మల్లదొడ్డిలో అసాగో ప్లాంట్ విస్తరణకు తీవ్ర వ్యతిరేకత


## ”పర్యావరణం కంటే లాభాలు ముఖ్యమా : మహమ్మద్ ఇక్బాల



గుమ్మల్లదొడ్డి, జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : తూర్పుగోదావరి జిల్లా, గుమ్మల్లదొడ్డి గ్రామంలోని అసాగో కంపెనీ ఇథనాల్ పరిశ్రమ విస్తరణలి పై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మానవ హక్కుల వేదిక అధ్యక్షులు మహమ్మద్ ఇక్బాల్‌లి పాల్గొని ప్లాంట్ విస్తరణను తీవ్రంగా వ్యతిరేకించారు.

ప్లాంట్ వల్ల ఇప్పటికే గాలి, నీరు, పంటలు పాడవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు 210 టన్నుల జూ2 ఉత్పత్తి అవుతుండగా, 170 టన్నులు గాల్లోకి వదులుతున్నారని, బొగ్గు కాల్చి ఇథనాల్ తయారు చేస్తూ పర్యావరణానికి మేలు చేస్తున్నామని చెప్పడం సరికాదన్నారు. ఇసి లో 1200 కెఎల్‌డి నీటి అనుమతి ఉండగా, 1591 ఖూణ అడుగుతున్నారని, అదనపు నీరు ఎక్కడి నుండి తెస్తారని ప్రశ్నించారు. ఇఐఎ నిబంధనల ప్రకారం పబ్లిక్ హియరింగ్ లేకుండా విస్తరణ చేయడం చట్టవిరుద్ధమని అన్నారు. దేశంలో ఇప్పటికే E20 ఇథనాల్ సర్ప్లస్ ఉండగా, ఎవరి లాభం కోసం ప్లాంట్ ను పెంచుతున్నారని నిలదీశారు. “మా ఊరు, గడ్డి, నీరు కాపాడండి. ప్లాంట్ విస్తరణను పూర్తిగా రద్దు చేయాలి” అని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్లాంట్ విస్తరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# నూతన తహసీల్దార్ కందుల కుశరాజుకు ఘన సన్మానం




కొత్తపేట, జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : డా బిఆర్ అంబేత్కర్ కొనసీమ జిల్లా,కొత్తపేట నియోజక వర్గం ఆలమూరు మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కందుల కుశరాజును పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చింతలూరు సొసైటీ చైర్మన్ నల్ల వెంకన్న, చింతలూరు నీటి సంఘం అధ్యక్షులు గారపాటి శ్రీనివాస్ చౌదరి, జనార్ధన స్వామి ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, చెముడులంక ఎంపీటీసీ తమ్మన భాస్కరరావు తహసీల్దార్‌ను కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆలమూరు మండల ప్రజలకు పారదర్శకంగా, వేగవంతమైన రెవెన్యూ సేవలు అందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని కోరుతూ తమ శుభాకాంక్షలుతెలియజేశారు.తహసీల్దార్ కందుల కుశరాజు అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# 30 న ఛలో కలెక్టర్ట్ : సీఐటీయూ




జగదాంబ , జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : అసంఘటిత రంగంలో, షెడ్యూల్డ్ పరిశ్రమలలో, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సంస్థలలో పనిచేస్తున్నటువంటి కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు తక్కువ లేకుండా చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్ ఈఎస్ఐ సెలవులు వంటి కార్మిక చట్టాలు అమలు చేయాలని, కార్మికులకు నష్టం చేసే 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 30వ తేదీ నాడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ ఆఫీస్ ల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలోధర్నాలు జరుగుతున్నాయి. ఈ ధర్నాలకు సంబంధించిన పోస్టర్ ను ఈరోజు జగదాంబ సిఐటియూ ఆఫీసులో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్ వి కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బి జగన్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఐదు సంవత్సరాలకి ఒకసారి అప్పడాల కనుగునంగా కనీస వేతనాలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవోలను సవరిస్తుంది. కానీ మన రాష్ట్రంలో 2007 సంవత్సరం నుండి కనీస వేతనాల జీవోలను సవరించలేదు. దీనివలన షాపింగ్ మాల్స్, పెట్రోల్ బంక్స్, హాస్పిటల్స్, విద్యా సంస్థలు, చిన్న పరిశ్రమలు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులకు 8 వేల నుండి 12 వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ 20 సంవత్సరాల కాలంలో నిత్యవసర వస్తువు ధరలు ఆకాశాని కంటాయన్నారు. ఇంటి అద్దెలు పిల్లల స్కూల్ ఫీజులు వైద్య ఖర్చులు రవాణా చార్జీలు విపరీతంగా పెరిగాయి అన్నారు. అయినా కార్మికుల జీతాలు మాత్రం పెరగలేదు అన్నారు. ఎనిమిది గంటల పని దినం సక్రమంగా ఎక్కడ అమలు కావడం లేదన్నారు. కార్మికులు రోజుకు కనీసం 12 గంటల పైబడి పని చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. అత్యధిక మందికి పిఎఫ్ ఈఎస్ఐ వారాంతపు సెలవులు వంటి కనీస కార్మిక చట్టాలు కూడా అమలు కావడం లేదన్నారు. ఎవరైనా మాట్లాడితే వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు అన్నారు. షాపింగ్ మాల్స్ లో ఖాళీ సమయంలో స్టూల్స్ వేసి కార్మికులు కూర్చోవచ్చని రాష్ట్ర హైకోర్టులు తీర్పు ఇచ్చినా అవి ఎక్కడ అమలు కావడం లేదు అన్నారు. విధ రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగస్తులను సంస్థలు విలీనం చేయకుండా అతి తక్కువ వేతనాలు ఇచ్చి వారితో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారన్నారు. మన పక్క రాష్ట్రమైన తెలంగాణలో ప్రస్తుతం కార్మికులకు ఇస్తున్న జీతం పై 20%, కర్ణాటకలో 60 శాతం పెంపుదల చేశారన్నారు. కావున రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ పనిచేసిన కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు తక్కువ లేకుండా చెల్లించే విధంగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జులై 30వ తేదీ నాడు కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గారికి సామూహిక వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. 30వ తారీఖున జరిగే చలో కలెక్టరేట్ కు కార్మికుల పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ ప్రెస్ మీట్ లో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం సుబ్బారావు, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి వెంకట్రావు, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యూనియన్ నాయకులు వై రాజు, హెచ్పీసీఎల్ షిప్యార్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి పైడ్రాజు కే పెంటారావులు పాల్గొన్నారు.

# జోనల్ కార్యాలయంలో 'మాట మంతి' కార్యక్రమం

## ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



జగదాంబ, జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే లక్ష్యంగా దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన 'మాట మంతి' కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాలు తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ప్రతి వినతిని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులను అక్కడికక్కడే ఆదేశిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులో పరిష్కరించి, తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించడమే 'మాట మంతి' కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఎస్ ఈ, ఏసీపీ ఝాన్సీ, ఏ ఎస్ ఓ శ్రీహరి ,వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్--2026 పోస్టర్‌ను

# ఆవిష్కరించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్




విశాఖపట్నం, జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "అమరావతి ఛాంపియన్‌షిప్--2026" ప్రచార కార్యక్రమంలో భాగంగా మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన ఛాంబర్ లో ఛాంపియన్‌షిప్ పోస్టరు ను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జూన్ గాలియట్ తో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నిర్వహిస్తుందని తెలిపారు. అమరావతి ఛాంపియన్‌షిప్--2026 యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, ఈ పోటీల్లో విశాఖపట్నం జిల్లాకు చెందిన క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. జూలై 15, 2026 నుంచి ఆగస్టు 26, 2026 వరకు జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల పరిధిలో 12 క్రీడాంశాల్లో ఈ ఛాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఇంచార్జ్ స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ. ఎ. అప్పలరాజు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లోహిత్ ఫార్మాపై చర్యలు తీసుకొని సమగ్ర విచారణ చేయాలి

పరవాడ, జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : అనకాపల్లి జిల్లా, పరవాడ ఫార్మా సిటీలో లోహిత్ ఫార్మా లో సోమవారం ఏ షిఫ్ట్ కి డ్యూటీకి హాజరై క్లీనింగ్ పనులు నిర్వహిస్తున్న టి.వి రమణమూర్తి56. అస్వస్థతకి గురయ్యారు. దీనిపై సమగ్ర విచారణ చేసి కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనకాపల్లి మండలం పాపి సంతపాలెం గ్రామానికి చెందిన టివి రమణమూర్తి కంపెనీలో డ్యూటీ సమయంలో దగ్గు వస్తుందని యాజమాన్యానికి చెప్తే బెల్లం తినమని సలహా ఇచ్చారని బెల్లం తిన్న దగ్గు తగ్గకపోవడం ఏ షిఫ్ట్ ముగించుకొని ఇంటికి వెళ్ళి తీవ్రమైన దగ్గు రావడం తో అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఇక్కడ వైద్యం జరగదని మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించాలని తెలిపారు. దీంతో విశాఖపట్నంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్నాడు. యాజమాన్యం మెరుగైన వైద్య సేవలు అందించాలని గని శెట్టి డిమాండ్ చేశారు. ఆయన కోలుకునే వరకు పూర్తిస్థాయి వేతనం చెల్లించాలని అన్నారు. పరిశ్రమలో ఏ రకమైన డ్రగ్ బ్యాచ్ వేస్తున్నారు. ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారు. వాటిపై సమగ్ర విచారణ చేయాలని గని శెట్టి డిమాండ్ చేశారు. సక్రమమైన మాస్కులు ధరించి ఉంటే కార్మికుడి పరిస్థితి ఈ రకంగా ఉండేది కాదని అన్నారు. ప్రభుత్వం వెంటనే యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంతో పాటు కార్మికుడికి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని గనిశెట్టి కోరారు.


# నేటి నుండి జగన్నాధస్వామి కల్యాణ రధోత్సవ మహోత్సవాలు



వేదభేరి - భీమునిపట్నం జూలై 14: స్థానిక గంటస్థంభం దరి శివ కేశవ ఆలయ ప్రాంగణం లో గల ఇంద్రద్యుమ్న మందిరం లో కొలివైఉన్న సుభద్ర బలభద్ర సహిత జగన్నాధస్వామి కల్యాణ రధోత్సవ మహోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. శివ కేశవ స్వామి దేవస్థానం ఎగ్జక్యూటివ్ ఆధార్టీ రొంపిచర్ల సింగరాచార్యులు, వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో 15 నుండి 25వ తేదీ వరకు నిర్వహించనున్న రధోత్సవ మహోత్సవాల్లో భాగంగా స్వామి వారు 10 రోజులపాటు వివిధ అవతారాల్లో( దశావాతరాలు ) భక్తులకు దర్శనం ఈయనున్నారు. 15 వ తేదీ(బుధవారం) ఉదయం నేత్రోత్సవం, సాయంత్రం స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవం, 16 వ తేదీ(గురువారం) ఉదయం తొలి రధాయాత్ర, సాయంత్రం స్వామి వారు వేద నారాయణ అవతారం, 17 వ తేదీ(శుక్రవారం) ఉదయం మత్స్యావతారం, 18 వ తేదీ(శనివారం)ఉదయం కూర్మావతారం, 19వతేదీ (ఆదివారం) ఉదయం ఆది వరహావతారం సాయంత్రం తోటకూర అమ్మవారి మ్రుహోత్సవం, సామూహిక కుంకుమార్చన, 20 వతేది (సోమవారం) ఉదయం నరసింహావతారం, 21 వ తేదీ(మంగళవారం)ఉదయం వామనావతారం, 22 వ తేదీ(బుధవారం)ఉదయం పరుశు రామావతారం, 23 వ తేదీ(గురువారం) ఉదయం రామావతారం, 24 వ తేదీ(శుక్రవారం) ఉదయం శ్రీ కృష్ణావతారం, 25 వ తేదీ(శనివారం)ఉదయం శయన ఏకాదశి వేడుకలు( శేష శయనఅవతారం, వైకుంఠ నారాయణ రూపం లో భక్తులకు దర్శనం ఈయనున్నారు. సాయంత్రం సుభద్ర బలభద్ర సహిత జగన్నాధస్వామి వారి మారు రధోత్సవం, తిరువీధి ఉత్సవం ( పుర వీధులగుండా ఊరేగింపు) చివరిగా స్వామి వారు వైకుంఠ ప్రవేశం అనంతరం మంగళ హారతి, ప్రసాద వితరణ లతో ఉత్సవాలు ముగియనున్నాయి.

# ఈవ్ టీజింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: సిఐ దివాకర్ యాదవ్

## విద్యాసంస్థల వద్ద ప్రత్యేక తనిఖీలు, విద్యార్థులకు అవగాహన



వేదభేరి - భీమునిపట్నం జూలై 14: ఎవరైనా ఈవ్ టీజింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని భీమిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి దివాకర్ యాదవ్ విద్యార్థులను హెచ్చరించారు. ఆయన ఆధ్వర్యంలో పోలీస్ లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మంగళవారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భం గా ఈవ్ టీజింగ్ కు పాలపడుతున్న 10 మంది విద్యార్థులను అదుపులోనికి తీసుకొని వారిని భీమిలి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం సి ఐ దివాకర్ యాదవ్ వారికి మహిళల భద్రత,చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించి వారిపై కేసులను నమోదు చేశారు.ఇక మీదట ప్రతి విద్యాసంస్థ వద్ద ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు నిర్వహిస్తూ తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమం లో మహిళా ఎస్ ఐ గౌరీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## సింగపూర్ జూ తరహాలో విశాఖ జూపార్కును

# అభివృద్ధి చేసేందుకు సంపూర్ణ సహకారం

### అవసరమైన నిధులు, మౌలిక వసతులు, సిబ్బంది అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం
### ఏపీ శాసనసభ వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కమిటీ ఛైర్మన్,స్పీకర్ అయ్యన్న పాత్రుడు









విశాఖపట్నం, జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : విశాఖపట్నం లోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో, సింగపూర్ మందాయ్ జూ పార్కు తరహాలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ శాసనసభ వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కమిటీ ఛైర్మన్, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. జూ అభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక వసతులు, సిబ్బంది, జంతు సంరక్షణ తదితర అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం కమిటీ సభ్యులతో కలిసి ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను సందర్శించిన స్పీకర్, జూలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జూ క్యురేటర్ డాక్టర్ మంగమ్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జూ అభివృద్ధి, జంతు సంరక్షణ, ఏనుగుల నిర్వహణ, సందర్శకులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమగ్ర వివరాలను కమిటీకి వివరించారు.

జూ చరిత్ర, విస్తీర్ణం, జంతు సంపద గురించి వివరిస్తూ 1972లో జూ స్థాపనకు అనుమతి లభించగా, 1977లో ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. 625 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ జూలో ప్రస్తుతం 108 జాతులకు చెందిన 1,404 జంతువులు సంరక్షణ పొందుతున్నాయని వెల్లడించారు. జూలో 81 ఎన్‌క్లోజర్లు ఉండగా, 81 మంది సిబ్బంది సేవలందిస్తున్నారని తెలిపారు. జూలో ఉన్న సరస్వతి, రాజు, కృష్ణ, లక్ష్మి పేర్లతో పిలిచే నాలుగు ఏనుగుల దినచర్య, ఆహారం, ఆరోగ్య సంరక్షణ, శిక్షణ, వ్యాయామం, వైద్య పర్యవేక్షణ తదితర అంశాలపై ప్రత్యేక ప్రజెంటేషన్ నిర్వహించారు. జంతువులకు శాస్త్రీయ పద్ధతుల్లో ఆహార పంపిణీ, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, ప్రత్యేక వైద్య సేవలు, సమ్మర్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలు, ఎనిమల్ ఎన్‌రిచ్‌మెంట్ ప్రక్రియ, ప్రత్యేక ఎన్‌క్లోజర్ల ఏర్పాటు వంటి చర్యలను అమలు చేస్తున్నట్లు క్యురేటర్ తెలిపారు. 2025-26 సంవత్సరంలో నాలుగు జూలతో జంతు మార్పిడి (ూాఅఙఘ్మిశ్రీ జుఇఎష్ట్ఘుఅస్త్రవ) కార్యక్రమాలు చేపట్టామని, అస్సాం జూ నుంచి బ్లాక్ పాంథర్‌ను తీసుకువచ్చామన్నారు. విశాఖ జూలో అనేక జంతువుల సంతానోత్పత్తి విజయవంతంగా కొనసాగుతోందని, ఇది జూ నిర్వహణలో ఉన్న నాణ్యతకు నిదర్శనమని వివరించారు. సీఎస్సార్ నిధుల సహాయంతో ఇప్పటికే 8 కొత్త ఎన్‌క్లోజర్లు నిర్మించి, పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. జంతువులను దత్తత తీసుకునే కార్యక్రమానికి దాతల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. 'వన్ డే -- వన్ స్కూల్' కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తూ విద్యార్థులకు జంతు సంరక్షణ, జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై జూ వైద్యాధికారి, ఇతర నిపుణుల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

**జూ అభివృద్ధిపై స్పీకర్ సూచనలు**

ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రస్తుతం ఉన్న బడ్జెట్ లోటును భర్తీ చేయడంతో పాటు ఆదాయానికి, నిర్వహణ ఖర్చులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఏడాది సీఎస్ఆర్ నిధుల ద్వారా కనీసం రూ.3 కోట్లను జంతు సంరక్షణకు సమీకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్తరాంధ్ర ఎంపీలు తమ ఎంపీ ల్యాడ్స్ నిధుల్లో 10 శాతం జూ అభివృద్ధికి కేటాయించే అంశాన్ని పరిశీలించాలని అభిప్రాయపడ్డారు. జూలో ఖాళీగా ఉన్న పోస్టులను అత్యవసరంగా భర్తీ చేయాలని, ఆర్థిక వనరులు సమకూరే ఆదాయ వృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టాలని సూచించారు. సందర్శకులను ఆకర్షించే వినోద కార్యక్రమాలతో పాటు అత్యున్నత ప్రమాణాలతో కూడిన క్యాంటీన్, మరిన్ని మౌలిక వసతులు, రోజువారీ సందర్శకుల అవసరాలకు అనుగుణమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. తిరుపతి వంటి సంస్థల నుంచి కూడా జంతు సంరక్షణ, జూల నిర్వహణకు ఆర్థిక సహాయం అందే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. తాను అటవీశాఖ మంత్రిగా ఉన్న సమయంలో కంబాలకొండను వైల్డ్‌లైఫ్ శాంక్చువరీగా ప్రకటించడం వల్ల ఆక్రమణలను సమర్థవంతంగా అరికట్టగలిగామని స్పీకర్ గుర్తు చేశారు. జూ సందర్శన అనంతరం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, కమిటీ సభ్యులు జూ ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు.

**ఏనిమల్ రెస్క్యూ సెంటర్ సందర్శన,**
**వాచ్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన**

కమిటీ సభ్యులు కంబాలకొండ ఏనిమల్ రెస్క్యూ సెంటర్‌ను సందర్శించి అక్కడ చేపడుతున్న జంతు సంరక్షణ చర్యలను పరిశీలించారు. కేంద్రంలో సందర్శకుల భద్రత, నిర్వహణను మరింత మెరుగుపర్చేందుకు అదనపు వాచ్‌టవర్, అదనపు పగోడా నిర్మాణానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కమిటీ సభ్యులు శంకుస్థాపన చేశారు. 2002లో ఆయన అటవీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు రెస్క్యూ సెంటర్ వద్ద వేసిన శిలాఫలకం దగ్గర అయ్యన్నపాత్రుడు కమిటీ సభ్యులతో కలిసి బృంద చిత్రం దిగారు.

ఈ పర్యటనలో కమిటీ సభ్యులు పాలవలస విక్రాంత్(ఎమ్మెల్సీ), బి. తిరుమల నాయుడు(ఎమ్మెల్సీ), ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, గోండు శంకరరావు, చింతమనేని ప్రభాకర్, వేగేశన నరేంద్ర వర్మ రాజు, అసెంబ్లీ సెక్రటరీ ప్రసన్నకుమార్ సూర్యదేవర, అటవీశాఖ ఉన్నతాధికారులు కాశీ విశ్వనాథ రాజు, చలపతిరావు, జూ క్యురేటర్ మంగమ్మ, జిల్లా ఫారెస్ట్ అధికారి రవీందర్ దామా, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగింపు

### జూలై 24 వరకు ఇంటింటి సర్వే.. అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రచురణ
### కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను వెల్లడించిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



విశాఖపట్నం, జూలై 14 (వేదభేరి ప్రతినిధి) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో బీఎల్వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమం జూలై 24 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా జూలై 24లోపు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ జరుగుతుందని, అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని చెప్పారు. అనంతరం వాటి విచారణ, పరిష్కార ప్రక్రియను సెప్టెంబర్ 28 వరకు పూర్తి చేసి, అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వివరించారు. ముందు షెడ్యూల్ ప్రకారం అయితే సెప్టంబర్ 22న తుది జాబితా ప్రచురణ జరగాల్సి ఉందని గుర్తు చేశారు.

జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన సవరించిన షెడ్యూల్ ప్రకారం వేగవంతంగా పూర్తి చేయడానికి అన్ని ఎన్నికల అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లినప్పుడు ఓటర్లు పూర్తి సహకారం అందించి అవసరమైన వివరాలు, పత్రాలను సమర్పించాలని కోరారు. అదేవిధంగా రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సవరించిన షెడ్యూల్‌ను గమనించి ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

Printed and Published by Musunuri Surya Narayana Murthy, and printed at Haritha Printers, plot no 70, vuda layout, Gopalapatnam, Visakhapatnam. 27, and published from 6-67, lakshmipuram, chintalagraharam post, pendurthi, visakhapatnam 47 and owned by kowndinya publications. Editor, M.S.N.MurthyRNI Reg APTEL/1999/00528. vedabheri@gmail.com Ph:9390156441